క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేపల్లె: 33 కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు రేపల్లె పట్టణం , రూరల్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్ సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చుండూరు (వేమూరు): మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యడ్లపల్లి ఫీడర్ గ్రామంలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

రేపు గ్రామ దేవత ఊరేగింపు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం పాంచాళవరం గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊరేగింపు అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏడు నుంచి తెనాలిలో తిరునాళ్ళ

తెనాలిటౌన్: స్థానిక ఐతానగర్‌లో వేంచేసియున్న శ్రీ వెంకయ్య–గౌరమ్మ పేరంటళ్ళమ్మ తిరునాళ్ళ మహోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అంగరంగా వైభవంగా జరగనున్నాయి. అఖండదీపంతో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు గుమ్మిడి సిడి, జల బిందెలు, పూల కప్పెర, పసుపు బండ్లు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మేక సిడి వంటి పలు ఆచారాలను నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు మొక్కలు, గంప సిడి మొక్కులతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

నేటితో ముగియనున్న పింఛన్ల పంపిణీ

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలి పట్టణంలో శుక్రవారం కొనసాగింది. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు అందుబాటులో లేని వారిని గుర్తించి వాటిని పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు 97.5 శాతం పంపిణీ పూర్తి అయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన విధులు ఉండటం వలన శనివారం కూడా మిగిలిన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

కారు అద్దం పగల గొట్టి రూ.40 వేలు చోరీ

లక్ష్మీపురం: పోస్టాఫీసులో ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి కారు వెనుక భాగం అద్దం పగల గొట్టి బ్యాగ్‌లో ఉన్న రూ.40 వేలు చోరీ చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన గంధ్ర సునీత, భర్త శ్యామ్(లేటు) వీరికి ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు. సునీత జేకేసీ కళాశాల వద్ద తను శ్రీ ఫ్యాషన్ పేరుతో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే గురవారం బ్రాడీపేటలోని పోస్టాఫీసులో ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు వచ్చిన సునీత కారును పార్కింగ్ చేసి పోస్టాఫీసులోకి వెళ్లింది. పని ముగించుకుని బయటకు వచ్చిచూసే సరికి కారు వెనుక భాగంలో ఉన్న అద్దం పగలగొట్టి బ్యాగ్‌లో ఉన్న రూ.40 వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. తక్షణమే అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భోజనం దొరక్క అవస్థలు

పెదకాకాని: అమరావతి రాజధానిలో ప్రధాని మోదీ సభకు జనాన్ని తరలించేందుకు శుక్రవారం నాయకులు అష్టకష్టాలు పడ్డారు. మండలంలోని గ్రామాలకు తెల్లవారే సరికే లెక్కకు మించి ఆర్టీసి బస్సులు చేరుకున్నాయి. ఎక్కడానికి ప్రజలు ఇష్టపడక పోవడంతో ఏ బస్సూ పూర్తిగా నిండలేదు. దీంతో వచ్చిన జనాన్ని ఎక్కించుకుని రాజధానికి వెళ్లారు.

గ్రామాల్లో కిశోరి వికాసం కమిటీలు

ప్రత్తిపాడు: కిశోరి బాలికల హక్కులు, సమస్యలపై అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాల్లో 'కిశోరి వికాసం' కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో సీహెచ్. విజయనిర్మల తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం నుంచి కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రత్తిపాడు, వంగిపురం, కొండేపాడు, రామానగర్ కాలనీల్లోని అంగన్‌వాడీల్లో కిశోర బాలికల పరిచయ కార్యక్రమం ఆయా గ్రామాల మహిళా సంరక్షణ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శిక్షణ లక్ష్యాలను నిర్దేశించుకోవడం, హక్కులు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాలను ఉద్దేశించి విజయనిర్మల మాట్లాడుతూ కమిటీకి కన్వీనర్‌గా మహిళా సంరక్షణ కార్యదర్శి, సభ్యులుగా అంగన్‌వాడీ కార్యకర్త, ఎంపీహెచ్‌ఈడబ్ల్యూ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వీవోలు ఉంటారని తెలిపారు. జూన్ పదవ తేదీ వరకు పన్నెండు రకాల అంశాలపై కిశోర బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'గిట్టుబాటు ధర' కల్పించని సర్కారు

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్


మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

నగరం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. మండల కేంద్రమైన నగరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు సరైన ధరలు లేక రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి మద్యం షాపులపై ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదన్నారు. ధాన్యానికి, మినుములకు, వేరుశనగకు.. ఇలా ఏ పంటకూ గిట్టుభాటు ధర లేక కల్లాల్లోనే ఉంచాల్సిన దయనీయ పరిస్థితులు తలెత్తాయన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన తదితర డబ్బులు రాకపోవడంతో చదువు కొనసాగించలేకపోతున్నట్లు తెలిపారు. కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారన్నారు. నిధులు కేటాయించకపోవడంతో కార్పొరేట్ వైద్యశాలల్లో సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

అటకెక్కిన సూపర్ సిక్స్ హామీలు

సూపర్ సిక్స్ హామీల పేరుతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పథకాల అమలు డబ్బులు లేవని చెప్పడం విడ్డూరమన్నారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధరలు కలిపించామన్నారు. వారికి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని, అన్ని రకాల ఇతర పంటలను కొనుగోలు చేశామని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, నాయకులు పాగోలు వెంకటేశ్వరావు, కొండలరెడ్డి, బాలకృష్ణ, బాబురావు, కర్రా వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'మండల పరిషత్తు' సమావేశం


సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, అధికారులు

కొల్లూరు: అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు, మండల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్చలు, భవిష్యత్తు అవసరాల కోసం ప్రణాళికలపై అభిప్రాయ సేకరణలతో జరగాల్సిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. శుక్రవారం కొల్లూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ కమ్మెల నాంచార్మ అధ్యక్షతన నిర్వహించారు. అధికారుల గైర్హాజరు, అరకొరగా వచ్చిన ప్రజాప్రతినిధుల నడుమ నామమాత్రంగా సమావేశం సాగింది. ఆర్ అండ్ బీ రహదారుల మరమ్మతుల్లో జాప్యంపై ప్రజాప్రతినిధులు ప్రశ్నించాలనుకున్నా జేఈ రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సిబ్బంది ప్రోటోకాల్ పాటించకుండా అధికార పార్టీకి చెందిన నాయకులతో కార్యక్రమాలు నిర్వహిస్తుండటంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించాలని ఎంపీడీఓను కోరారు. ఇసుక లారీలు రాత్రింబవళ్లు తిరుగుతుండటంతో లంక గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సభ్యులు డీటీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీడీఓ కె.నరసింహారావు, డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటా



నగరం: పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. మండలంలోని ఈదుపల్లి గ్రామానికి చెందిన నాయకుడు దడిగ నాగమల్లేశ్వరావు తండ్రి లక్ష్మయ్య పెదకర్మ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. తొలుత లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈదుపల్లి గ్రామానికి చెందిన తాడికొండ ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులను కూడా గణేష్ పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ రామకృష్ణ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాగోలు వెంకటేశ్వరావు, నాయకులు కొండలరెడ్డి, బాబురావు ఉన్నారు.

పౌష్టికాహారం ఎంతో అవసరం



వేమూరు: కొమర బాలల సమస్యల పరిష్కారానికి తగిన పౌష్టికాహారం అవసరమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ అమృతవాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దీనికి సంబంధించిన అవగాహన కార్యక్రమం జరిగింది. పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణా నిరోధం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం, ఆత్మరక్షణ, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.సరోజి, సయ్యద్ మస్తాన్‌బీ, ఈ. రెబ్బమ్మ, రాజకుమారి, జి.అమల, జి. ధనమణి, సీహెచ్. మాధవి, వి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'రోటరీ'చే వీల్‌చైర్ల పంపిణీ



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన తొమ్మిదిమంది పిల్లలకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ సహకారంతో ఈ వితరణ చేశారు. రోటరీ, తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, రొటేరియన్లు పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, గుత్తా వెంకటరత్నం, కొత్తపల్లి సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, ఈదర ఆనంద్, కుర్రా శ్రీనివాసరావు, జీవీ నారాయణ, కేవీ కృష్ణ, ఎన్.కిషోర్, జవ్వాజి శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీధర్, ఆలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నాగాంజనేయులు


కుసుమకుమారి

రేపల్లె: రేపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నూతన కమిటీ అధ్యక్షురాలిగా బి.కుసుమకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవాధ్యక్షుడు గోట్టుముక్కల బాలాజీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం 17 మందితో కూడిన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షులుగా బేతపూడి కోటేశ్వరమ్మ, తుపాకుల శ్యామల, కార్యదర్శిగా పడమట అనూరాధ, సహాయ కార్యదర్శులుగా మండే శాంతకుమారి, దుర్గాభవాని, కోశాధికారిగా ఎర్రంశెట్టి రాజ్యలక్ష్మి తదితరులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కార్మికులకు కనీస వేతనంగా రూ.35 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు కోరారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 5వ తేదీన ఆందోళన కార్యక్రమాలలో భాగంగా పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ,ఏఐటీయూసీ నాయకులు సీహెచ్ శివశంకర్, సజ్జ రాజ బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట వల- స్థలాలు చూపి ఎర!

- ప్రభుత్వ ఉద్యోగాలు, ఇళ్ల స్థలాల పేరిట మోసాలు
- లక్షల్లో నష్టపోతున్న బాధితులు
- కేటుగాళ్ల వలలో పడొద్దంటున్న పోలీసులు


ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడిన నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్

తెనాలిరూరల్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇళ్ల స్థలాలు తక్కువ ధరకే ఇప్పిస్తామంటూ కేటుగాళ్లు వేసే వలలో పడి ఎందరో ఆర్థికంగా నష్టపోతున్నారు. కొందరైతే తాము నష్టపోయామని గ్రహించకుండా తమ బంధువులనూ ఈ కేటుగాళ్ల వలలో పడేసి వారూ నష్టపోయేందుకు కారణమవుతున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి మోసాలు ఎక్కువ అవుతున్నాయి. వీరి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు.

- తెనాలికి చెందిన పాండురంగ విఠల్, గుంటూరుకు చెందిన గౌరీనాథశాస్త్రిల నుంచి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 12 లక్షలు తీసుకున్నాడు.
- రాజధాని ప్రాంతంలో తక్కువ ధరకు ఇంటి స్థలం వస్తుందని ఆళ్లమూడి శివప్రసాద్ నుంచి రూ. 12.40 లక్షలు తీసుకుని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ నుంచి తీసుకున్నట్టు నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చాడు.
- ఆళ్లమూడి శివప్రసాద్ వియ్యంకుడు వెంకటసత్య నరసింహమూర్తి తక్కువ ధరకే స్థలం దొరుకుతుందని నమ్మి రూ. 40 లక్షలు చెల్లించాడు.
- బంగారం బిస్కెట్ తక్కువ ధరకు వస్తుందంటే శివప్రసాద్ రూ. 8.55 లక్షలు ఇచ్చి నష్టపోయాడు. పెదరావూరుకు చెందిన చొప్పర సుధాకర్ ప్రభుత్వ ఉద్యోగం కోసం రూ.1.50 లక్షలు ఇచ్చి నష్టపోయాడు.
- పట్టణ మారిస్‌పేటకు చెందిన కె.మహేష్‌బాబుకు రైల్వే వర్క్‌షాప్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ భార్యాభర్తలు 2024లో రూ. 4.60 లక్షలు తీసుకున్నారు. నవంబరులో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.
- పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామానికి చెందిన ఎంబీఏ విద్యార్థి నాగరాజుకు తన సహచర విద్యార్థిని పరిచయమై హైదరాబాద్‌లో ఉగ్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 1.05 లక్షలు తీసుకుంది. కాలయాపన చేస్తుండంతో పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. పది రోజుల్లో మొత్తం చెల్లిస్తానని ఒప్పుకుని, చివరకు బెదిరింపులకు పాల్పడుతోంది.

ఇలా ప్రభుత్వ, ప్రైవేటు కొలువులు ఇప్పిస్తామని, తక్కువ ధరకు ఇళ్ల స్థలాలు, బంగారం ఉందని చెప్పి మోసాలకు పాల్పడే వారి బారిన పడి ఎందరో నష్టపోతున్నారు. ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

- తెనాలి ప్రభుత్వ వైద్యశాల సమీపంలో నివసించే ఆరెమండ తేజ కృష్ణ కమల్ తాను ఏపీ సచివాలయంలో ఏఎస్‌ఓగా పని చేస్తున్నానని అందరినీ నమ్మిస్తూ వచ్చాడు. అందుకోసం నకిలీ ఐడీ కార్డు, ఎంప్లాయి హెల్త్ కార్డులను తయారు చేయించాడు. వాటిని చూపి సచివాలయంలో తనకు ఉన్న పలుకుబడి ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పేవాడు. ఈ క్రమంలో వీరి ఇంటి సమీపంలోనే నివసించే విశ్రాంత ఉద్యోగి ఆళ్లమూడి శివప్రసాద్ కొడుకు వెంకట మణికంఠకు హైకోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 3.40 లక్షలు తీసుకున్నాడు. వారికి నమ్మకం కలిగేలా ఏపీ హైకోర్టు సిటిజన్ పోర్టల్‌లో వారి ఫోన్ నంబరు రిజిస్టర్ చేయడంతో వెంకట మణికంఠ ఫోన్‌కు ఓటీపీ వెళ్లింది. హైకోర్టు నుండి ఓటీపీ రావడంతో తమకు ఇక ఉద్యోగం వచ్చినట్టేనని భావించారు.

ఒకటికి రెండుమార్లు సరిచూసుకోండి

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామని, తక్కువ ధరకే బంగారం, స్థలాలు ఉన్నాయని చెప్పే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి. ఒకటికి రెండు సార్లు వారి వివరాలను పరిశీలించుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగినని చెబితే ఉద్యోగం చేస్తున్నాడో లేదో విచారణ చేయాలి. ఇటువంటి వారి వలలో పడకుండా ఉండడమే మంచిది.

–ఎస్. రమేష్‌బాబు, త్రీ టౌన్ సీఐ

జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గురువులు శ్రీశంకరాచార్య, శ్రీరామానుజస్వామి జయంతిని నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజి) ప్రత్యేక పూజలు చేశారు. జగద్గురువులు శ్రీశంకరాచార్య, శ్రీరామానుజస్వామి విశిష్టతలను భక్తులకు తెలియజేశారు. శ్రీఆదిశంకరాచార్యులు సనాతన ధర్మం కోసం, వాటి విలువల కోసం ఎంతో కృషిచేసినట్టు చెప్పారు. హిందూ సనాతన ధర్మం వేదాలను దేశవ్యాప్తంగా కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్రలతో ధర్మప్రభోదం చేసినట్టు వివరించారు. జయంతి సందర్భంగా సాయంత్రం లక్ష మల్లెపూలతో పూజలు జరిపించారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, రాజేశ్వరావు, మహిళా భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా తిరునాళ్ల ప్రారంభం


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బాపట్ల: బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి శ్రీ త్రిశక్తి దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం వరకు వేడుకలు కొనసాగనున్నాయి. ఉదయం తోరణపాకు అలంకరణ, విఘ్నేశ్వర పూజ, శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ వారి శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవం చేపట్టారు. శనివారం ఉదయం అమ్మవార్లకు విశేష పూజ, అర్చనలు, పూల అలంకరణ జరగనున్నాయి. సాయంత్రం ఐదు గంటలకు కొల్లా వారి ఇంటి నుంచి పసుపు, కుంకుమ బండితో గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం కోదండ రామ కోలాట సమాజం పిల్లలచే కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు, పూలతో అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పొంగళ్ల నైవేద్యం, సాయంత్రం విద్యుత్ ప్రభ ఊరేగింపు ఉంటాయి. దేవాలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని చైతన్య వేదిక, సమరత సేవా ఫౌండేషన్ ,విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన నిజాంపట్నం మండలం గరువుపాలెం హనుమాన్ విగ్రహం నుంచి నగరం హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్ర జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని సమరత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా కార్యవాహ వరికుటి శివగోపి కోరారు. పట్టణంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. హిందువుల ఐక్యతను చాటి చెప్పేలా 18వ తేదీన జరిగే శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు గరువుపాలెం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర నగరం హనుమాన్ ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. హిందూ పరిషత్తు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు జంజనం హేమ శంకరరావు, బందారు రమేష్, పేరం కోటేశ్వరరావు, జంగం శ్యాంప్రసాద్, బాబురావు, యడ్లపల్లి శివ నాగమల్లేశ్వరరావు, గుంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి నాగ పడగ కానుక


నాగపడగను అందిస్తున్న శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి బాపట్ల జిల్లా కొల్లూరు మండలం యాదవపాలెం గ్రామస్తుడు డొక్కు శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు సుమారు రూ.65 వేల విలువ గల 525 గ్రాముల వెండితో తయారు చేసిన నాగపడగను కానుకగా సమర్పించారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావుకు వెండి నాగపడగను అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్


మాట్లాడుతున్న పి.వెంకటేష్

తెనాలిటౌన్: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన్నప్పటికి ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బ్రిడ్జి కోర్సుల పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేయించుకుంటున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు దోచుకోవడమే పనిగా ఇంటింటికీ తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుల్లో ఉల్లాసంగా గడపాల్సిన విద్యార్థులు బ్రిడ్జి కోర్సుల పేరుతో పాఠశాలల్లో మగ్గుతున్నారని విమర్శించారు. జీవోనెం.77ను రద్దు చేసి అందరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం హామీలను నేరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వేసవిలో జరుగుతున్న తరగతులను నిలుపుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జి.శివనాగరాజు, తెనాలి పట్టణ ఉపాధ్యక్షుడు భూమేష్, కోశాధికారి తేజ, సహాయ కార్యదర్శి దినేష్, నాయకులు అఖిల్, పండు, హేమంత్, సాయి, తదితరులు ఉన్నారు.

ఉమ్మడి కుటుంబాలతోనే ప్రయోజనమన్న నాటికలు


'కిడ్నాప్' నాటికలో సన్నివేశం

తెనాలి రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో శుక్రవారం రాత్రి ఆరంభమైన ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగాయి. తొలుత ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శించారు. కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజెప్పిందీ నాటిక. స్వార్థజీవనానికి అలవాటు పడుతున్న యువత తల్లిదండ్రులను దూరంగా ఉంచుతున్న తీరును కళ్లకు కట్టారు. వందలకొద్దీ పుస్తకాలు చదివితే వచ్చే విజ్ఞానం, మన ఇళ్లలోని పెద్దవాళ్లు చెప్పే మాటలతోనే వస్తుందని పాత్రలతో చెప్పించారు. ప్రధాన పాత్రల్లో చెరుకూరి సాంబశివరావు, అమృతవర్షిణి, షేక్ హసన్, ఎస్.పూజిత, నడింపల్లి వెంకటేశ్వరరావు, లోకేష్ నటించారు. చెరుకూరి సాంబశివరావు రచించిన ఈ నాటిక ప్రదర్శనకు ఆయనే దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రుతువు లేని కాలం' నాటికను ప్రదర్శించారు. అగస్త్య రచించిన నాటికకు వైబీ చౌదరి దర్శకత్వం వహించారు. సమిష్టి కుటుంబాలపై చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో ద్వేషాన్ని చర్చించిందీ నాటిక. సోకులకీ, ఫ్యాషన్లకీ లొంగిపోయి, వాళ్లకి వాళ్లే బానిసలుగా మిగిలిపోతున్నారు. వార్ధక్యం పేరుతో పెద్దవాళ్లని దూరంగా వుంచుతున్నారు. అలాంటి జీవితాలను ఎంచుకోవటం ఎలా సబబు? వాళ్లకు మనుష్యుల మధ్య బంధాల విలువ ఎలా తెలుస్తుందనే అంశాన్ని ఉదాత్తంగా ప్రశ్నించిందీ నాటిక. కాలం రుతువుల్లో భద్రంగా ఉన్నట్టే మనిషి బంధాల మధ్య హాయిగా, రక్షణగా ఉంటుందనే సందేశాన్నిచ్చింది. ప్రధాన పాత్రల్లో వై.బుచ్చయ్య చౌదరి, కె.వీరయ్య, జి.సురేంద్రబాబు, సునయన, రత్నబాబు, సురభి ప్రభావతి, కె.శ్రీనివాసరావు తదిరులు నటించారు. చివరగా గురజాడ కళామందిర్ వారి 'మహాప్రస్థానం' నాటికను ప్రదర్శించారు. పేదరికాన్ని అధిగమించాలనే ఆలోచనతో అవగాహన లేని ప్రయాణం ప్రస్థానమై, మహాప్రస్థానమై చావుకి, ప్రయాణానికీ మధ్య గీతను చెరిపేస్తుందనే సత్యాన్ని చాటిందీ నాటిక. బొర్ర నరేన్, ఎల్ఎస్‌కేఆర్‌కే ప్రసాద్, ఈవన రమేష్‌బాబు, పిల్లా నటరాజ్, ఆర్.రాజేశ్వరి నటించారు. ఎం.సంజీవి రచించిన నాటికను పిల్లా నటరాజ్ దర్శకత్వంలో ప్రదర్శించారు.